ప్రజాశక్తి
గురువారం 9 జనవరి 2025 5
శ్రీ సత్యసాయి

పుడా ఛైర్మన్‌పై 'పల్లె' కన్ను..!

◆ ఇప్పటికే ఆ పదవిపై పలువురు ఆశావహుల ప్రయత్నాలు
◆ టిడిపి అధిష్టానానికి విజ్ఞాపనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకుడు పల్లె రఘునాథరెడ్డి పుట్టపర్తి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సంస్థ (పుడా) ఛైర్మన్ పదవి చేపట్టేందుకు పావులు కదుపుతున్నారనే ప్రచారం ఇటీవల జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ఆయన కోడలు పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈమె రాజకీయాలకు కొత్త కావడంతో పల్లె రఘునాథరెడ్డి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆమెకు సహకారం అందిస్తున్నారు. ఏ కార్యక్రమం జరిగినా ఆయన ముందుండి నడిపిస్తున్నారు. ఇదే సమయంలో ప్రోటోకాల్ సమస్య ఆయనుకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. ఈ నేపథ్యంలో పుడా ఛైర్మన్ పదవి తీసుకుంటే అన్నింటికీ వీలుగా ఉంటుందనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలను పుడా పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పుడా ఛైర్మన్ పదవిని తీసుకుంటే ప్రొటోకాల్ వర్తిస్తుంది. ఈ కారణంగానే పల్లె రఘునాథ్ రెడ్డి ప్రొటోకాల్ నిమిత్తం పుడా ఛైర్మన్‌పై కన్నేసినట్లు సమాచారం. కుప్పం పర్యటన ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పల్లె రఘునాథ్ రెడ్డి కోడలు ఎమ్మెల్యేగా ఉన్నందున అదే కుటుంబానికి నామినేటెడ్ పదవిని అధిష్టానం ఇస్తుందా.. లేదా అన్న దానిపై సందిగ్ధం నెలకొంది. పుడా ఛైర్మన్ పదవిని పల్లె రఘునాథరెడ్డికి ఇస్తే ప్రొటోకాల్ సమస్య తీరి నియోజవకర్గంలో టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందని ఆయన మద్దతుదారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో ఆయన కుటుంబంలో ఇప్పటికే ఒక పదవి ఉన్నందున మరొకటి అవసరం లేదనే వాదన కూడా ఆ పార్టీ వర్గాల్లో కొందరి నుంచి వ్యక్తం అవుతోంది. ఎలాగైనా ఈ పదవిని చేపట్టాలన్న ఉద్దేశంతో ఇప్పటికే పల్లె రఘునాథరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ద్వారా ఈ పదవి ప్రస్తావన తెస్తున్నట్లు సమాచారం.

పెద్ద సంఖ్యలో ఆశావహులు

పుడా ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో పుట్టపర్తి నుంచి చాలా మందే ఆశావహులు ఉన్నారు. టిడిపి తెలుగు యువత నాయకులు రామలక్ష్మణ్, బెస్త చలపతి, పిసి.గంగన్న, లోకేష్‌తో సన్నిహితంగా ఉన్న సురేష్ నాయుడు (ఊరు వాకిలి సురేష్), మాజీ పుడా ఛైర్మన్ కడియాల సుధాకర్, సామకోటి ఆదినారాయణ తదితరులు పేర్లు విన్పిస్తున్నాయి. వీరంతా అవకాశం వచ్చినప్పుడల్లా విజయవాడకు తమ బయోడేటా తీసుకుని వెళ్లి అదిష్టానానికి అందజేస్తున్నారు. ఇక ఈ పదవి కోసం టిడిపితో పాటు మిత్రపక్ష పార్టీలైన జనసేన, బిజెపి నాయకులు సైతం వారి ప్రయత్నాలు ముమ్మరంగానే చేస్తున్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ కూడా ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి నామినేటెడ్ పోస్టు ఇప్పించాలని కోరుతున్నట్లు సమాచారం. పుడా ఛైర్మన్ కోసం పెద్ద ఎత్తున పోటీ ఉండడం, స్వయంగా పల్లె రఘునాథరెడ్డి ఈ పదవిని ఆశిస్తున్న సమయంలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందా అన్న ఆశక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

నష్టపోయాం.. ఆదుకోండి..!

◆ కీలకమైన సమయంలో వర్షాభావం
◆ పంటలు చేతికందలేదు..
◆ కేంద్ర కరువు బృందంతో రైతులు
◆ ఉమ్మడి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన

ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లిలో జొన్నపంటను పరిశీలిస్తున్న కేంద్ర కరువు బృందం సభ్యుడు పొన్నుస్వామి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, తాడిమర్రి, ముదిగుబ్బ

'పంటకు కీలకమైన సమయంలో ఒకటిన్నర నెల పాటు తీవ్ర వర్షాభావం నెలకొంది. పంట మొత్తం నష్టపోయాం. పెట్టుబడులు కూడా చేతికందలేదు. పూర్తిగా నష్టపోయాం.. ఆదుకోండి.' అంటూ కేంద్ర కరువు బృందానికి ఉమ్మడి జిల్లా రైతులు విజ్ఞప్తి చేశారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. 2024 ఖరీఫ్‌కు సంబంధించి నెలకొన్న కరువు పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం బుధవారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించింది. రూరల్ డెవలప్‌మెంట్ అండర్ సెక్రటరీ జయంతి కనోజియా, ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పొన్నుస్వామిలు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. వీరు మొదట సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లి గ్రామంలో పర్యటించారు. కంది, వేరుశనగ రైతులతో మాట్లాడారు. అనంతరం బత్తలపల్లి మండలం రాంపురం గ్రామం మీదుగా తాడిమర్రి మండలంలోని తాడిమర్రి గ్రామం వరకు పర్యటించారు. ఇక్కడ ఉలవ, జొన్న రైతులతో మాట్లాడి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం నుంచి అనంతపురం జిల్లాలో కరువు బృందం పర్యటించింది. అనంతపురం జిల్లా అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల గ్రామంలో మొదట కరువు బృందం పర్యటించింది. ఇక్కడ రైతు కొండప్ప పొలంలో పర్యటించి ఏ పంట వేశారు...ఏ మేరకు నష్టం జరిగిందన్న వివరాలను ఈ బృందం సేకరించింది. వేరుశనగ విత్తనం వేయగా ఒకటిన్నర నెల పాటు వర్షాభావం నెలకొందని కొండప్ప కరువు బృందానికి వివరించారు. దీని వల్ల దిగుబడి లేకుండా నష్టపోవాల్సి వచ్చిందని చెప్పారు. అనంతరం రాప్తాడు మండల కేంద్రంలో కరువు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో 2024లో నెలకొన్న వాతావరణ పరిస్థితులను కలెక్టర్ వినోద్‌కుమార్ కరువు బృందం సభ్యులకు వివరించారు. అనంతరం రైతులతో ముఖాముఖి అయ్యారు. ఖరీఫ్‌లో కీలకమైన జులై, ఆగస్టు నెలలో తీవ్రమైన వర్షాభావం జిల్లాలో నెలకొందని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కరువు బృందానికి తెలియజేశారు. కరువు ప్రకటించిన ఏడు మండలాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఇదే రకమైన వాతావరణం మూలంగా రైతులు నష్టపోయి ఉన్నారని చెప్పారు. అందరు రైతులను ఆదుకోవాలని కోరారు. సిపిఐ జిల్లా నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ వర్షాభావంతో చాల చోట్ల భూగర్భ జలాలు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. హంద్రీనీవాకు లైనింగ్ చేయవద్దని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లాకార్యదర్శి ఓ.నల్లప్ప రైతులను ఆదుకోవాలని కరువు బృందానికి వినతిపత్రం అందజేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కరువు బృందాన్ని కలసి రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో నెలకొన్న కరువుపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర కరువు బృందం సభ్యులు

రైతులను అన్ని విధాలా ఆదుకోండి : సిపిఎం

జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర కరువు బృందం సభ్యులను బుధవారం తాడిమర్రిలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు మొత్తం అతివృష్టి, అనావృష్టితో చేతికందకుండా పోయాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర బందం స్పందించి జిల్లాకు రూ.పదివేల కోట్ల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఉపాధి పనులు విరివిగా కల్పించాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లను వందశాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. జిల్లాలో శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ కోరారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలని టిడిపి నాయకులు రఘురాం చౌదరి కోరారు.

జిల్లా రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

విమానాశ్రయాన్ని పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పర్యటనకు తెలుగుదేశం జాతీయ నాయకుడు, మంత్రి లోకేష్ రానున్న తరుణంలో సత్యసాయి విమానాశ్రయంలో ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రత్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి డిఎస్‌పి, శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం, ఎయిర్‌పోర్ట్ సిఐ, విమానాశ్రయ సిబ్బందితో కలిసి ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం లోకేష్ పర్యటనలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి భద్రత ఏర్పాట్లను నిర్వహించాలని అధికారులకు సూచించారు. పుట్టపర్తి విమానాశ్రయం, కొత్తచెరువు, ధర్మవరం, బత్తలపల్లి దాటేయేంతవరకు రోడ్డు మార్గాన పోలీసుల తీసుకోవాల్సిన బందోబస్తు, ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

మాజీ ఎమ్మెల్సీకి సన్మానం

ప్రజాశక్తి- మడకశిర

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని సన్మానించారు. టిఎన్‌టియుసి అధ్యక్షులు బియు. రాజు ఆధ్వర్యంలో గుండుమల తిప్పేస్వామికి కంబళి, హారంతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్, కౌన్సిలర్ ఉమాశంకర్, మీడియా కోఆర్డినేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని తలమర్ల, మీర్జాపురం, నాగిరెడ్డిపల్లి, గ్రామాల్లో టీమ్ మెంబర్లు ఇర్షాద్ అహ్మద్ ,హర్షద్ సలీం, డాక్టర్ సునీల్ మూడవరోజైన బుధవారం వికలాంగుల పింఛన్లను పరిశీలించారు. 22 మంది పింఛనుదారుల ఇంటి వద్దకు వెళ్లి వారి స్థితిగతులను పరిశీలించి వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరచినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిడి నారాయణ, సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

వాసవి క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు దాసా సందేష్, అంతర్జాతీయ డైరెక్టర్ కట్టా అమర్, క్లబ్ మాజీ అధ్యక్షులు రఘునందన్ గుప్తల సమక్షంలో ఎన్నుకున్నారు. సత్య సాయి జిల్లా వాసవి క్లబ్ హిందుపురం నూతన అధ్యక్షులుగా ఏం రాజేంద్ర గుప్తా, కార్యదర్శులుగా దాసా విష్ణు, హెచ్‌ఆర్ కిరణ్ తో పాటు మరి కొంత మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు టిజి. సుబ్రమణ్యం, దాసా గంగాధర్, కెఎన్ సూర్యనారాయణ, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ఖరారులో జాప్యం

అగ్రిమెంట్ కాపీని చూపిస్తున్న గుత్తేదారుడు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా తాను ఆన్ లైన్ ద్వారా దక్కించుకున్న పనులకు సంబంధించి టెండర్ ఖరారులో అధికారులు తీవ్ర జ్యాప్యం చేస్తున్నారని చిత్తూరు జిల్లాకు చెందిన గుత్తేదారుడు గోవర్ధన్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. గత సంవత్సరం హిందూపురం పురపాలక సంఘంలో రూ. 5 లక్షలు విలువ చేసే చెట్ల పంపిణీ కోసం ఆన్‌లైన్ విధానంలో టెండర్‌ను పిలవడం జరిగిందన్నారు. ఈ టెండర్ ఆన్‌లైన్ లో దక్కించుకొని, నిబంధనల మేరకు ఇఎండి, ఎపిటిఎస్ చెల్లించి అగ్రిమెంట్ సైతం పూర్తి చేసుకున్నానన్నారు. చెట్లను పంపిణీ చేస్తానని అధికారులకు కోరుతున్నప్పటికీ వారు ఒప్పుకోవడం లేదన్నారు. దీంతోపాటు రూ 16 లక్షలకు సంబంధించి చెత్త సేకరణ బండ్లు (పుష్ కార్ట్స్) తో పాటు పారిశుధ్య విభాగానికి సంబంధించిన వివిధ పరికరా కోసం ఆన్ లైన్ ద్వారా టెండర్ పిలిస్తే దీనిని సైతం తాను దక్కించుకున్నానన్నారు. అయితే ఈ పని విషయంలో అగ్రిమెంట్ చేసుకోవడానికి తిరుపతి నుంచి ఇక్కడికి పలుమార్లు వచ్చినప్పటికీ అగ్రిమెంట్ చేసుకోకుండా అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను వివరణ కోరగా చిత్తూరు జిల్లాకు చెందిన

గుత్తేదారుడి ఆవేదన

గుత్తేదారుడు గోవర్ధన్ బాబు గతంలో హిందూపురం పురపాలక సంఘంలో పలు టెండర్లను దక్కించుకుని సకాలంలో దానికి సంబంధించిన మెటీరియల్ ను పంపిణీ చేయలేదన్నారు. దీంతోపాటు పారిశుధ్య కార్మికుల కోసం కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులతోపాటు జాకెట్, ఇతర పరికరాలు సరఫరా చేస్తామని టెండర్ దక్కించుకుని సంవత్సరాలు గడిచినప్పటికీ సరఫరా చేయలేదన్నారు. వీధి దీపాల నిర్వహణలో భాగంగా ఎల్ఈడి లైట్ల మరమ్మతులకు సంబంధించిన మెటీరియల్ సైతం టెండర్ దక్కించుకుని సరఫరా చేయలేదన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని సకాలంలో గుత్తేదారుడు సరఫరా చేయడని, ప్రస్తుతం దక్కించుకున్న టెండర్లకు సంబంధించిన మెటీరియల్ సరఫరా చేస్తే మిగిలిన పనులను అగ్రిమెంట్ చేసి ఇస్తామని సూచించామని తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో 'పులమతి' విద్యార్థిని

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి వైష్ణవి జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 బాలికల రబ్బీలో రాష్ట్ర జట్టు తరపున జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనపర్చింది. బీహార్ రాష్ట్రం పాట్నాలో జనవరి 2 నుండి 4వ తేదీ వరకు జరిగిన పోటీలలో పాల్గొన్న 9వ తరగతి విద్యార్థిని బి వైష్ణవి ప్రతిభ కనపర్చింది. ప్రతిభా విద్యార్థినిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఉర్దూ విద్యార్థులకు ఉర్దూ మాధ్యమంలో పదవ తరగతి స్టడీ మెటీరియల్స్ మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, టిడిపి పట్టణ అధ్యక్షులు డి.ఇ.రమేష్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఇమ్రాన్ అధ్యక్షత వహించారు. ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఉర్దూ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవి, ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు అన్సార్, ఇమ్రాన్, కౌన్సిలర్లు ఆదిల్, ఇర్షాద్ అహ్మద్, టిడిపి నాయకులు అమర్నాథ్, డైమండ్ బాబా, అజ్మతుల్లా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకంతో చెరువులకు నీరందించాలి

తాడిమర్రి :ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని అన్ని చెరువులకు నీరందించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల నాగభూషణ్ కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర కరువు బృందం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని ఉన్న ప్రతి ఒక్క చెరువుకి సమీపాన ఉన్నటువంటి చిత్రావతి రిజర్వాయర్ నుండి ప్రతి సంవత్సరం రెండు టీఎంసీలు చొప్పున మండలంలో ఉన్న ప్రతి చెరువుకు నీరందించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి, తదితరులు

వసతిగృహానికి డ్రెయినేజీ సౌకర్యం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

పరిగి మండలం సేవామందిరం బాలుర వసతిగృహానికి వెంటనే డ్రయినేజీ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎఐడిఎస్ఒ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక బాలుర వసతిగృహాన్ని సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బాలుర వసతిగృహ భవనం శిథిలావస్థకు చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇరుకు గదులలోనే ఇబ్బందులకు గురవుతూ కాలం వెలబుచ్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నూతన భవనాన్ని నిర్మించాలన్నారు. వెంటనే డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బిసి. సంక్షేమ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు నాయకులు మహేష్ బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఫోన్ లో సంప్రదించగా వారం రోజులలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఎఐడిఎస్ఒ నాయకురాలు పూజిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వివరిస్తున్న విద్యార్థులు

నేడు డాకు మహారాజ్ ప్రీరిలీజ్ ఈవెంట్

హాజరుకానున్న మంత్రి నారా లోకేష్ - బాలకృష్ణతో పాటు చిత్ర యూనిట్...

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన డాకు మహారాజ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ గురువారం నాడు అనంతపురం నగరంలో జరుగనుంది. సాయంత్రం జరిగే ఈ ఈవెంట్‌కు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతపురం నగరం శ్రీనగర్ కాలనీలోని ముత్యాల్‌రెడ్డి గ్రౌండ్స్‌లో ఈవెంట్ జరగనుంది. భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జగదీశ్ నేరుగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సభా ప్రాంగణానికి స్వయంగా వెళ్లి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈవెంట్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా విచ్చేస్తున్నారు. ఈయనతో పాటు హీరో బాలకృష్ణ, చిత్ర యూనిట్ సభ్యులందరూ కూడా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెనుగొండ ఎఫ్ఎసి కమిషనర్‌గా సతీష్ కుమార్

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్



అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న వి.సతీష్ కుమార్ పెనుగొండ నగర పంచాయతీ ఎఫ్ఎసి కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి నారాయణ మురుగన్ ఉత్తర్వులు జారీ చేశారు. పెనుగొండ కమిషనర్ జి.శ్రీనివాసులు 21 రోజుల మెడికల్ లీవ్‌పై వెళ్లారు. ఆయన విధుల్లోకి వచ్చేంత వరకు సతీష్ ఎఫ్ఎసి కమిషనర్‌గా కొనసాగుతారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా శెట్టిపి జయచంద్రారెడ్డి

జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సత్యసాయి జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు శెట్టిపి జయచంద్ర రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం కాకినాడ నగరంలోని పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు జరిగిన 17వ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా రాష్ట్ర నాయకత్వం శెట్టిపి జయచంద్రరెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. శెట్టిపి జయచంద్రా రెడ్డి కార్యకర్త స్థాయి నుండి ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శిగా, కోశాధికారిగా, గౌరవ అధ్యక్షులుగా, అధ్యక్షులుగా, ఉమ్మడి అనంతపురం జిల్లా పాప్టో ఛైర్మన్ గా పనిచేసి, ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. జయచంద్రా రెడ్డి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికవ్వడం పట్ల యుటిఎఫ్ జోన్ నాయకులు రామకృష్ణ నాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, అమర్నారాయణ రెడ్డి, రాంప్రసాద్, హరికృష్ణ, బిల్లే రామాంజనేయులు, సాయి గణేష్, ఎచ్, రామాంజనేయులు, హరిశంకర్, మేరీవర కుమారి, లతాదేవి, నాగేంద్రమ్మ, రమీజాబీ, నాగిరెడ్డి, జనార్ధన్, కిషోర్, మైనుద్దీన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మనూస్ డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్‌కు ఎదురుగా ఉన్న మనూస్ డాన్స్ అకాడమీ మూడవ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ ఆరుద్ర శ్రీనివాస్, ప్రముఖ ఆస్ట్రాలజర్ కుంచెపు గంగరాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మనుస్ డాన్స్ అకాడమీ స్థాపించిన ఈ మూడు సంవత్సరాల కాలంలో కదిరి ప్రాంతానికి ఎంతో గుర్తింపు తెచ్చారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహం ఇస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలియజేశారు. కళా రంగంలో చేస్తున్నటువంటి సేవలకు శ్రీ పద్మావతి ట్రస్ట్‌కు తాము అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. నిర్వాహకులు తేపల్లె మనోహర్ మాట్లాడుతూ కదిరి ప్రాంతంలో మూడు సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ నృత్య కళను జిల్లా, రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో ప్రముఖ కళా వేదికలపై ప్రదర్శన ఇప్పించామన్నారు. అనంతరం కళా రంగంలో తాను చేసిన సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ తీసుకున్న ఆరుద్ర శ్రీనివాస్ కుంచపు గంగరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్డే బాబు, పీట్ల రామకృష్ణ, ఒడిసి జ్ఞాన సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కృష్ణమోహన్ రెడ్డి, మాస్టర్లు చిన్ను, వినోద్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

బాలికల వసతిగృహంలో మౌలిక వసతులు కరువు

డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
రోగాల పాలవుతున్న బాలికలు
మెనూ ప్రకారం అందని భోజనం

హాస్టల్ భవనం వెనుక పేరుకుపోయిన మురుగు, చెత్త

పాచిపట్టి అధ్వాన్నంగా మారిన హాస్టల్ భవనం గోడలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పేదింటి బిడ్డలకు వసతి సౌకర్యాలతో కూడిన చదువులు అందిస్తామని ఒకవైపు పాలకులు పదేపదే చెబుతున్నారు. కాని ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపంతో వసతిగృహాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. పలు సమస్యలు తిష్ట వేశాయి. బాధ్యతలు నిర్వహిస్తున్న వారి స్వలాభాల కారణంగా శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు కనీస వసతి సౌకర్యాలు కరువయ్యాయి. నాణ్యమైన ఆహారం అందక అనేక అగచాట్లు పడుతున్నారు. వందమంది విద్యార్థినులు చదువుకుంటున్న ఆదర్శ పాఠశాలలో గదులకు గడియలు లేకపోవడంతో విద్యార్థులు భయం భయంగా గడుపుతున్నారు. పాఠశాల వెనుక వైపు చెత్తాచెదారం పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారి రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. కిటికీలకు తలుపులు లేకపోవడంతో చలికాలం విద్యార్థినులు వణికిపోతున్నారు. చల్లటి నీటితో స్నానాలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు మొత్తం వసతిగృహం వెనుక భాగాన నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. నివసించడానికి యోగ్యమైన పరిస్థితులు అక్కడ కనిపించడమే లేదు. విద్యార్థులు బాధలు వర్ణనాతీతం.

పక్కదారి పట్టిన మెనూ

పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు మెనూ ప్రకారం తప్పనిసరిగా భోజనం వడ్డించాల్సి ఉన్నా ఒక్కరోజు కూడా మెనూ పాటించడం లేదు. ప్రతిరోజు ఉడికి ఉడకని అన్నం వండి వడ్డిస్తుండడంతో ఆ ఆహారం తినలేక బయట ఎవరికీ చెప్పుకోలేక విద్యార్థినులు సతమతమవుతున్నారు. చేసిన అన్నం సగం తింటూ సగం బయట పారబోస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ తనిఖీలో మరిన్ని సమస్యలు బహిర్గతం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళలు పాఠశాలను తనిఖీ చేయగా అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తమ బాగోగులు పట్టించుకునే వారెవరూ లేరని, చలికి వణికి పోతున్నామని వాపోయారు. సమస్యలతో సతమతమవుతూ పెట్టింది తిని ఉంటున్నామన్నారు. పాఠశాలలో వస్తువులు కూడా మాయమైపోతున్నాయని భయం భయంగా నిజాలు బయటపెట్టారు. స్నానపు గదులకు గడియలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. పాఠశాల వెనుక వైపు కుప్పలు కుప్పలుగా చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తున్నాయని వాపోయారు. మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతకమైన జ్వరాలు ప్రబలుతున్నట్లు చెప్పారు. ఇక్కడే ఉండి చదువుకుందామంటే మౌలిక వసతుల లేమితో ఇబ్బంది పడుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

చర్యలు తీసుకోవాలి

జగరాజుపల్లి వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల వసతిగృహం సమస్యల వలయంలో చిక్కుకుంది. అక్కడ పరిస్థితులను మా మహిళ నాయకులు చూసి చలించిపోయారు. బాలికలు మౌలిక వసతులు లేకపోవడంతో సతమతమవుతున్నా ప్రిన్సిపల్ రమేష్ బాబు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు తినే ఆహారం అధ్వానంగా ఉంది. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారు వడ్డిస్తుండడంతో విద్యార్థులు కడుపునిండా తిండి కూడా తినలేకపోతున్నారు. హాస్టల్లో డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అసలు మనుషులు నివసించడానికి అనుకూలమైన పరిస్థితులు అక్కడ కనిపించడం లేదు. విద్యార్థులు తమ సమస్యలను తెలుపుతూ రాసిన లేఖను ఎస్ఎఫ్ఐ తరపున కలెక్టర్ చేతన్‌కు స్పందనలో సమర్పించాము. అయితే సమస్యలు పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు నాకు మెసేజ్ రావడం విడ్డూరంగా ఉంది. సమస్యలపై జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రిన్సిపల్ రమేష్ బాబు ఇంతవరకు స్పందించకపోవడం బాధాకరం. ప్రిన్సిపల్ రమేష్ బాబు నిర్లక్ష్య ధోరణి విడనాడాలి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపోతే పుట్టపర్తికి వస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఎస్ఎఫ్ఐ తరపున సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోతాం.

పవన్,
ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు

సమస్యలు పరిష్కరిస్తాం

పాఠశాల హాస్టల్‌లో ఉన్న సమస్యలు ఇప్పుడే నా దృష్టికి వచ్చాయి. ప్రస్తుతం హాస్టల్లో విద్యార్థులు ఉన్నారు. సంక్రాంతి సెలవుల్లో హాస్టల్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం.

రమేష్‌బాబు,
పిన్సిపల్

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ ప్రసాద రావు, ఎస్ఐ శంకర్ తెలిపారు. బుధవారం ఉదయం వాహనాల తనిఖీలో భాగంగా మారుతి ఓమినీ కారులో తీసుకువెళు తున్న కర్నాటక మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని చిన్నమంతురులో టింబక్టు కలెక్టర్ సంస్థ సీఈవో లావణ్య, అధ్యక్షురాలు సుశీలమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్షతను, హింసను నాటిక రూపంలో ప్రదర్శించారు. మహిళలకు గృహహింస, బాల్యవివాహాలు, సమానత్వం, నిర్ణయాధికారం, వంటి అంశాలపై నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా మహిళలు కూడా పురుషులతో సమానమేనని సమాజంలో మహిళలు సగభాగం ఉన్నారని అన్నారు. అన్ని రంగాలలో మహిళలకు ప్రోత్సాహం అందిస్తే వారు రాణించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్ సంస్థ సిబ్బంది, చిన్నమంతూరు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టపర్తి పర్యటనను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకేష్ గురువారం గన్నవరం నుండి నేరుగా సాయంత్రం4:00 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలకడానికి పుట్టపర్తి నియోజవర్గ ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పుట్టపర్తి విమాన శ్రేయము నుండి రోడ్డు మార్గాన కొత్తచెరువు, ధర్మవరం మీదుగా అనంతపురం చేరుకుంటారని చెప్పారు. అక్కడ జరిగే నందమూరి బాలకృష్ణ నటించిన చిత్రం "డాకు మహారాజ్ సినిమా ఫ్రీ రిలీజ్ ఈవెంట్" లో ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ,కొత్త చెరువు మీదుగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు రోడ్డు మార్గాన అనంతపురం వెళ్తున్న సమయంలో కూటమి నాయకులు భారీగా తరలిరావాలని కోరారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల పరిధిలోని గౌకన్నపేట గ్రామంలో ఎఒ లోకేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారి బాబా పక్రుద్దీన్, ఎఒ లోకేశ్వర్ రెడ్డి తదితరులు పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు బ్రహ్మానందం రెడ్డి పొలంలో మల్బరీ పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంటసాగులో సూచనలు చేస్తున్న అధికారులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వారికి వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్ గోవిందరాజులు, విశ్రాంత ఉపాధ్యాయుడు అనంతయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో మానతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వపు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆనంతరం వ్యాసరచన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన 9వ తరగతి విద్యార్థి అరవింద్, ద్వితీయ స్థానంలో నిలిచిన 8వ తరగతి విద్యార్థి భానుచరణ్, తృతీయ స్థానాన్ని దక్కించుకున్న ఆరవ తరగతి విద్యార్థి శివకేశవకు బహుమతులు ప్రదానం చేశారు. వకృత్వపు పోటీలలో ప్రథమ స్థానంలో 8వ తరగతి విద్యార్థి మధుచంద్ర, ద్వితీయ స్థానంలో 8వ తరగతి విద్యార్థి పివి. కారుణ్యరెడ్డి, తృతీయ స్థానంలో ఆరవ తరగతి విద్యార్థి మోక్షిత్ నిలిచారు. వారికి మానతా స్వచ్ఛంధ సేవా సంస్థ తరపున ముఖ్య అతిథులు చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ మాధవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి-పెనుకొండ

ఉద్యానవన శాఖ, డిజిటల్ గ్రీన్ సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ-మిర్చా ప్రాజెక్టులో భాగంగా మట్టి పరీక్షలపై విఎఎ, హెచ్ఎలకు బుధవారం శిక్షణ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని ఉద్యానవన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెనుకొండ, సికె పల్లి, రామగిరి, సోమందేపల్లి, రొద్దం మండలాలకు చెందిన 60మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ ఉద్యాన రైతులకు అధునాతన సాంకేతికతను అందించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్‌కు చెందిన కిట్ ఉపయోగించి రైతుల పొలాలలో మట్టి పరీక్షలు ఎలా చేయాలో వివరించారు. ఈ పరిజ్ఞానం వల్ల కేవలం 15 నిమిషాల్లో మట్టి పరీక్ష ఫలితాలు రైతులకు తెలుపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రామ్ ప్రసాద్, డిజిటల్ గ్రీన్ ప్రతినిధులు జి. శ్రీకాంత్, ప్రవర్షిణి పాల్గొన్నారు.

మట్టిపరీక్షలు చేస్తున్న సిబ్బంది

పర్యాటకులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - లేపాక్షి

లేపాక్షి ఆలయాన్ని సందర్శించే పర్యాటకులకు వైద్యసేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్న ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమా నందన్ తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇందుకు సంబందించిన ఆరోగ్య శాఖ నుండి అధికారకంగా బుధవారం ఉత్తర్వులు వచ్చాయన్నారు. పర్యాటకులకు ఎలాంటి అలసట కలగకుండా ప్రవేట్ ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు.

తూముకుంట పంచాయతీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూముకుంట పంచాయతీ తూముకుంటలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు బుధవారం సర్పంచి రత్నమ్మ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు పారిశుధ్య కార్మికుల ద్వారా పనులను చేయించారు. తూముకుంట గ్రామంలో పిచ్చి మొక్కల తొలగింపు, డ్రయినేజీల్లో మట్టి తొలగింపు, కాలువలు శుభ్రపరచడం, దోమల నివారణకు పిచికారి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి రెంచరాయప్ప పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

దళితుల శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

మండలంలోని బసంపల్లిలో దళితులు మృతిచెందితే ఖననం చేయడానికి ప్రతిసారి పోరాటం చేయాల్సి వస్తోందని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి అన్నారు. బుధవారం చెన్నే కొత్తపల్లి తాహశీల్దార్ సురేష్ బాబును బసంపల్లి దళితులతో కలసి శ్మశాన వాటికను కాపాడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 17 -1లో 1.39 ఎకరాల భూమిని మాలల శ్మశాన వాటిక కోసం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు.అయితే అదే గ్రామంలోని కొంతమంది ఆక్రమించుకొని దౌర్జన్యంగా చెట్లు నాటారని వాపోయారు. ఏళ్ల తరబడి శ్మశాన వాటిక కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ అంతంత మాత్రమే న్యాయం జరుగుతోందన్నారు. ఎవరైనా దళితులు మృతిచెందితే మృతదేహాలను ఇళ్ల ముందుకు పెట్టుకుని ఎక్కడ పూడ్చాలో తెలియక అయోమయంలో పోలీసు రక్షణ ఉంటే తప్ప పూడ్చుకోలేకపోవడం బాధాకరమన్నారు. శ్మశాన వాటికను కబ్జా చేసిన వారు మాత్రం పేదలను కోర్టుల చుట్టూ తిరిగేలా చేస్తూ భయపెడుతున్నారన్నారు. శ్మశానవాటికలోకి ఎవరు పోవద్దంటూనే వాళ్లు మాత్రం దర్జాగా చెట్లుని పెంచుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి దళితులకు శ్మశాన వాటిక చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో బసంపల్లి దళితులు కోట్ల మల్లికార్జున, ఎర్రిస్వామి, రామకృష్ణ, నరసింహులు, మల్లేశు, నాగమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారితో మాట్లాడుతున్న నాయకులు, గ్రామస్తులు

ముందస్తు 'సంక్రాంతి' సంబరాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి వద్ద ఉన్న బ్లూ మూన్ ఇన్స్టిట్యూట్‌లో సంక్రాంతి సంబరాలను బుధవారం నిర్వహించారు. విద్యాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్లూ మూన్ విద్యా సంస్థల చైర్మన్ ఎం.శివశంకర్ మాట్లాడుతూ సంక్రాంతి పండగ విశిష్టతను తెలియజేసేందుకు ముందస్తుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులకు పండుగల పట్ల ఆసక్తి పెరగడంతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసేందుకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి విద్యా సంస్థల సెక్రటరీ శ్రీదేవి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేంద్ర రెడ్డి, పాఠశాల ఇన్‌ఛార్జి మాధవరెడ్డి, పిటి రామాంజనేయుల రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుక్కపట్నం :మండల కేంద్రంలోని జిల్లా శిక్షణ విద్యా కేంద్రంలో డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, సంక్రాంతి విశిష్టతను తెలుపుతూ కోలాటం, భోగి మంటలు, వివిధ రకాల ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల అధినేత పెద్దరాసు సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రామకృష్ణ, హరినాథ్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రాధిక, నీలిమ, శ్రావణి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

శిల్పారామంలో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

స్థానిక శిల్పారామంలో మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 13న టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సహకారంతో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన మహిళలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. 14వ తేదీన స్థానిక బిల్డర్లు ప్రదీప్, రమేష్ సహకారంతో జబర్దస్త్ కళాకారులు గల్లీ బాయ్ రియాజ్, రాజమౌళి, శాంతి స్వరూప్‌లతో కామెడీ ప్రోగ్రాం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమం తో పాటు పులివెందుల రాజా డ్యాన్స్ అకాడమీ వారిచే కూచిపూడి, భరతనాట్యం, డీజే నృత్యాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వినాయక డాన్స్ అకాడమీ ధర్మవరం వారిచే నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొంటారని చెప్పారు. పుట్టపర్తి పట్టణ వాసులు పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు పాల్గొనాలని ఈసందర్భంగా కోరారు.

కందుల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - రొద్దం

మార్కెట్‌ఫెడ్ కంపెనీ ప్రతినిధులు మండలంలోని పలువురు రైతులకు చెందిన కందుల నాణ్యతను బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలో రైతుల పండించిన కందులను కొనుగోలు చేయడానికి ఈ నెల 16న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ కంపెనీ ఎఫ్ఇఒ రామాంజనేయులు తెలిపారు. దీంతో ముందుగా బుధవారం పెనుగొండ బాగోడ ప్రధాన రహదారిలో శ్రీ బాలాజీ లేఅవుట్లలో ఉన్న కందుల నాణ్యతను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ కంపెనీ ఎఫ్ఈఓ రామాంజనేయులు, రైతులు బికె. సుధాకర్, మారుతి రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, జయరాములు, ధనుంజయ రెడ్డి, కొట్టాల రమేష్, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

కందుల నాణ్యతను పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు

పశువైద్య శిబిరం

తలుపుల : మండల పరిధిలోని ఓదులపల్లి గ్రామ పరిధిలో సబ్బునుగుంతపల్లి, రాచువారి పల్లి, రెడ్డివారి పల్లి గ్రామాలలో సిఎస్ఎ సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ ఎఫ్ కోఆర్డినేటర్ శ్యామల , రమణ, మండల పశువైద్య డాక్టర్ నారాయణ స్వామి నాయక్ ఆధ్వర్యంలో పశువులకు చికిత్సలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అదిశంకర్, భాస్కర్, విద్యాసాగర్, సచివాలయం ఎహెచ్ఎలు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను విజయవంతం చేయండి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్రామ పట్టణ ప్రాంతాల్లో రైతుల సమన్వయంతో భూముల రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆమె బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో డివిజన్‌లోని తహశీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, రోడ్డులు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు గ్రామపటంలో గుర్తించాలన్నారు. రైతుల భూములు హద్దులు /గట్లు సమస్యలను పరిష్కరించాలన్నారు. రోవర్స్ ద్వారా సర్వే నిర్వహించాలన్నారు. ఈ రీసర్వేను ప్రజలందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిఎఒ జిలాని, డీటీలు మనోజ్ కుమార్ రెడ్డి, మంజుల, స్వాతి, తహశీల్దార్లు పుట్టపర్తి అనుపమ, కొత్తచెరువు నీలకంఠారెడ్డి, ఒడిసి అనంతచారి, బుక్కపట్నం షాబుద్దీన్, నల్లమాడ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది.శిల్ప, తన కుమార్తె నవ్యశ్రీతో కలసి ముందుగా సాయి కాలేశ్వర్ చిత్రపటం వద్ద పూజలు చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో విదేశీ వైద్యులచే చెవి, ముక్కు, గొంతు, కంటి, చర్మ, పంటి సమస్యలకు సంబందిత వైద్య పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేశారు .వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి యంత్రాలు అందించారు. అదేవిధంగా కండరాలు, కీళ్ళనొప్పులు వున్న వారికి ఫిజియోథెరపీ చేశారు. నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు నిర్వహించిన వారికి అవసరమైన మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ పది సంవత్సరాలనుండి ప్రతి ఏడాది విదేశీ వైద్యులు చే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని శిల్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది,ట్రస్ట్ సిబ్బంది చిట్టిబాబు, హరి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి

Appeal Suit No:12/2012

Between:

చంటిమల్లా చెన్నమ్మ మరియు ఇతరులు ...**Appellants**

మరియు

చంటిమల్లా మధుసూదన్ రెడ్డి మరియు ఇతరులు ...**Respondents**

R5.Y.పారిజాతమ్మ W/o Late రామమోహన్ రెడ్డి,
R6.Y.యశశ్విని D/o Late రామమోహన్ రెడ్డి, Residing at మామిళ్లకుంట్లపల్లి, తిప్పేపల్లి పోస్ట్, ఓబులదేవర చెరువు మండలం, శ్రీసత్యసాయి జిల్లా.

పైA.S.లో R5 మరియు R6 ప్రతివాదులకి నోటీసులు

పై A.S.లో Appellants చంటిమల్లా చెన్నమ్మ మరియు ఇతరులు, చంటిమల్లా మధుసూదన్ రెడ్డి మరియు ఇతరులపై దాఖలు చేసి ఉన్నారు. పై A.S.లోని Appellant No.9 Y.రామమోహన్‌రెడ్డి చినపోయినందున, వారి వారసులుగా మిమ్ములను చేర్చి ఉన్నారు. కావున పై Appeal suit ను ఘనమైన కోర్టువారు 20/01/2025వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు.కావున మీరు 20/01/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకి స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనలు ఉన్న యెడల తెలుపుకొనవలెను.లేనిచో ఘనమైన కోర్టువారు పై Appeal ను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:**20/01/2025**
స్థలం:కదిరి

జి.గురులింగస్వామి, B.A., B.L.,
వాదితరుపు వకీలు, కదిరి.

CHANGE OF NAME

I, S.SUVARNA BAI, Wife of Service No.GS-178095M, Rank: EQPT MECH (Mech) Name: M SEETHA RAM NAIK, Unit: 1086 Filed Workshop (GREF) C/O 99 APO, residing at D.No.6/430A, Vinayaka Nagar, Somandepalli Mandal, Sri Sathya Sai District of A.P.State-515122 declare that in my husband's service records my name is wrongly mentioned as M.SUVARNA BHAI, A.SUVARNA BAI, M.S.SUVARNA BAI and my date of birth wrongly mentioned as 10-10-1982 **and** 17-10-1981. **My correct name is S.SUVARNA BAI** and **my correct date of birth is 10-08-1983 which is endorsed in my Aadhar and PAN Card.**

CHANGE OF NAME

I, MOOD YASWANTH NAIK, Son of Service No.GS-178095M, Rank: EQPT MECH (Mech) Name: M SEETHA RAM NAIK, Unit: 1086 Filed Workshop (GREF) C/O 99 APO, residing at D.No.6/430A, Vinayaka Nagar, Somandepalli Mandal, Sri Sathya Sai District of A.P.State-515122 declare that in my father's service records my name is wrongly mentioned as YESHWANT NAIK, YESHWANT NAYAK and YASWANT RAJ and my date of birth wrongly mentioned as 22-08-2003. **My correct name is MOOD YASWANTH NAIK and my correct date of birth is 22-08-2002 which is endorsed in my Aadhar and PAN Card.**

CHANGE OF NAME

I, M SEETHA RAM NAIK, my Service No.GS-178095M, Rank: EQPT MECH (Mech) Name: M SEETHA RAM NAIK, Unit: 1086 Filed Workshop (GREF) C/O 99 APO, residing at D.No.6/430A, Vinayaka Nagar, Somandepalli Mandal, Sri Sathya Sai District of A.P.State-515122 declare that in my service records my younger son name is wrongly mentioned as M.S.PRABHUVARAM NAIK. **My younger son correct name is M.PRABHUVARAM NAIK and my younger son date of birth is 25-11-2010 which is endorsed in my Aadhar**

CHANGE OF NAME

I, M SEETHA RAM NAIK, my Service No.GS-178095M, Rank: EQPT MECH (Mech) Name: M SEETHA RAM NAIK, Unit: 1086 Filed Workshop (GREF) C/O 99 APO, residing at D.No.6/430A, Vinayaka Nagar, Somandepalli Mandal, Sri Sathya Sai District of A.P.State-515122 declare that in my service records my father name is wrongly mentioned as M.RAMULA NAYAK. **My father correct name is M.RAMLA NAIK which is endorsed in my Aadhar and PAN Card.**